నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | ఫిబ్రవరి 10, 2025 | www.navatelangana.com

రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-బోధన్

రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్‌బిన్ హందాన్ జన్మదినం సందర్భంగా ఆదివారం బోధన్ కాంగ్రెస్ నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాశంకర్, దాము, గణపతిరెడ్డి, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాహెర్‌బిన్ హందాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పలువురు

నేటి ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా

- ప్రజలు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహించనున్నట్టు సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని పేర్కొన్నారు. ప్రజల విజ్ఞాపనలు తీసుకోవడానికి కలెక్టరేట్‌లోని రూం నెంబర్ 25లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజల సమస్యల దరఖాస్తులు హెల్ప్‌డెస్క్‌లో అందజేయవచ్చని తెలిపారు.

కంది రైతుకు.. రంది లేదు

మండలంలో కంది పంట దిగుబడి భారీగా పెరిగింది. గతంలో కంది పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తమ కుటుంబ అవసరాల కోసం మాత్రమే కంది పంటను పండించేవారు. ప్రస్తుతం ధరలు భారీగా పెరగడం.. మార్కెట్‌లో కంది పప్పుకు డిమాండ్ అధికంగా ఉండడంతో రైతులు కంది పంట సాగుపై ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దానికి అనుగుణంగానే ఈ సారి దిగుబడి పెరిగిందని రైతులు అంటున్నారు.

భారీగా కంది పంట దిగుబడి.. ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు


ఆరబోసిన కంది పంట

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామాలలో రైతులు ఈ సారి కంది పంటను అంతర్ పంటగా సుమారు 1100 ఎకరాల్లో పండించారు. ప్రస్తుతం కంది పంట ధర క్వింటాకు రూ.7550గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2023-24 సంవత్సరంలో మద్దతు ధర రూ.7వేలు ఉండగా.. 2024-25 సంవత్సరంలో రూ.7550 ధరను కేంద్రం ప్రకటించింది. అంటే గత ఏడాది కన్నా ఈ ఏడు రూ.550 పెరిగింది. మద్దతు ధర ముందస్తుగానే ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

పెరిగిన దిగుబడి..

దిగుబడి ఈసారి ఎకరాకు మూడు క్వింటాళ్ల నుంచి 5 క్వింటాళ్ల వరకు దిగుబడి పెరిగింది. నీటి తడి ఏర్పాటు చేసుకున్న రైతులకు ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్లు, సాధారణ వర్షపాతానికి పండించిన పంట ఎకరాకు మూడు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని రైతులు అంటున్నారు.

ఆరు క్వింటాళ్లు దిగుబడి

నాకు రెండున్నరెకరాల సొంత భూమి ఉంది. అందులో సోయపంట పండిస్తూ అంతర్ పంటగా కంది పంటను సాగుచేశాను. ప్రస్తుతం కంది పంటకు నీటి సౌకర్యం ఉండడం వలన రెండు పర్యాయాలు నీరు పెట్టాను. కంది దిగుబడి ఎకరాకు 6 క్వింటాళ్లు వచ్చింది.

- సాయిలు రైతు, హంగర్గ.

మార్కెట్‌లో మంచి ధర

నాకు ఎకరం సొంత భూమి ఉంది. అదనంగా మూడూ ఎకరాలు కౌలు చేస్తున్నాను. నీటి వసతి లేకపోవడం వలన వర్షాధారంపైనే ఆధారపడి కంది పంటను అంతర్ పంటగా పత్తిలో పండించాను. ఎకరాకు మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్లో మంచి ధర ఉంది.

- నాగయ్య రైతు, డోన్గావ్.

నసురుల్లాబాద్‌లో శబ్ద కాలుష్యం

- కాలం చెల్లిన వాహనాలకు సైలెన్సర్లు..
- బైక్ రైడర్ల జోరు.. ప్రజలు బేజారు



నసురుల్లాబాద్ మండల కేంద్రంలో బైక్ రైడర్లు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు బిగించడంతో మండల కేంద్ర ప్రజలు బేజారు పడుతున్నారు. అధిక శబ్దంతో పోలీస్ స్టేషన్ ముందు నుంచి బైక్ రైడర్లు వెళ్తున్నా.. పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి బైక్‌రైడర్లను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఉన్న ప్రజల నిద్రకు కరువవుతోంది. చంటి పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు. నసురుల్లాబాద్ మండల కేంద్రంలో యమహా, సుజుకి పాత వాహనాలతో పాటు ఇతర వాహనాలకు సైలెన్సర్లు బిగించడంతో శబ్ద కాలుష్యం ఏర్పడుతోంది. ఇందులో యువకుల వద్ద అతి పురాతన యమహా, సుజుకి వాహనాల సైలెన్సర్‌లు బిగించిన వాహనాలతో రాత్రి 9 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నసురుల్లాబాద్ ప్రధాన వీధుల్లో చక్కర్లు కొడుతున్నారు. దీంతో వాహన ధ్వని కాలుష్యం నానాటికీ మితిమీరుతున్నది. ప్రత్యేకించి కాలం చెల్లిన వాహనాలను మరమ్మతులు జరిపి బైక్ పునరాగమనం తర్వాత ఈ సమస్య వికృతరూపం దాల్చింది.

అందరూ గాఢనిద్రలో ఉండే అర్ధరాత్రి సమయంలో ప్రశాంతతను భగ్నం చేస్తూ బైకులు వీరవిహారం చేస్తున్నారు. ఆ బైకులతో వచ్చే ఒరిజనల్ సైలెన్సర్లను తీసివేసి, విపరీత శబ్దాలు చేసే ప్రత్యేక సైలెన్సర్లు బిగించే కార్ఖానాలు అనేకచోట్ల వెలిశాయి.

పోలీస్ ఆదేశాలు బేఖాతరు..

వాహన ధ్వని కాలుష్య నియంత్రణ చట్టాలు ఉన్నా పోలీసు యంత్రాంగం అనాసక్తత వల్ల అవి నిరుపయోగంగా మిగిలాయి. సెక్షన్ 190(2), 1988 మోటారు వాహనాల చట్టం ప్రకారం బైకులతో వచ్చే సైలెన్సర్లను, హారన్లను మార్చడం నిషేధం. ధ్వని కాలుష్యాన్ని పరిమితుల్లో ఉంచడానికి అవసరమైన ఇతర నిబంధనలు ఆ చట్టంలో ఉన్నాయి. బైకులపై వెనుక కూర్చునేవారు కూడా హెల్మెట్ ధరించాలంటూ నిబంధనలు అమలు చేస్తున్న పోలీసు యంత్రాంగానికి, ధ్వని కాలుష్య నియంత్రణ చట్టాలు పట్టకపోవడం విచిత్రం.. విషాదం. అంటే మా ఇష్టమొచ్చిన చట్టాలను, ఇష్టమొచ్చిన రీతిగా అమలు చేస్తామనే నిరంకుశ ధోరణి ఇది పసిపిల్లలు, వృద్ధులు, రోగులు, ఇతర ప్రజానీకం కూడా ఈ బైకుల ధ్వని కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం విపరీతమైన ఒత్తిళ్లతో నిండిన నసురుల్లాబాద్ మండల ప్రజలకు ఈ బైకువీరుల ఆగడాలతో మరింత ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఈ సమస్యపై దృష్టి పెట్టి.. ధ్వని కాలుష్య నియంత్రణకు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు చలో ఇందిరా పార్క్

- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్


మాట్లాడుతున్న మోతీరాం నాయక్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే నేటి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో వందలాది మంది రైతులు, కార్మికులు, ప్రజలు బడ్జెట్లో తమ వాటా కోసం, కేంద్ర ప్రభుత్వం మోసపూరితమైన బడ్జెట్‌ను పున:పరిశీలించాలనే డిమాండ్‌తో చలో ఇందిరా పార్క్‌ను విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు మోసం చేసే బడ్జెట్‌ను కేటాయించి బడాబాబులకు పట్టం కట్టే విధంగా ఈ బడ్జెట్‌ను తయారు చేశారన్నారు. గత ఎనిమిది మాసాల నుంచి రైతులకు రుణమాఫీ చేయాలని, గిట్టుబాటు ధరలు కల్పించాలని దానికో చట్టం చేయాలని రైతుల పోరాడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం 10 సంవత్సరాల కాలం నుంచి రైతులను మోసం చేస్తూనే వస్తుందన్నారు. మూడు నల్ల చట్టాలను దొంగదారిలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. దానికోసం రాష్ట్రవ్యాప్త ప్రజాసంఘాల పిలుపులో భాగంగా రైతు సంఘం ముందు భాగం నిలబడి పోరాడుతుందని ఈ పోరాటంలో వేలాదిమంది రైతులు ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవి పుమానాయక్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్


యువకులను అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-భిక్కనూర్

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తూ, వ్యసనాలకు అలవాటైన యువకులను భిక్కనూర్ పోలీసులు అరెస్టు చేసి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూర్ మండలంలో గంజాయి విక్రయిస్తూ దాని వ్యసనానికి అలవాటు పడిన 8 మంది యువకులు భిక్కనూర్ గ్రామానికి చెందిన పాల్వంచ భరత్, బేతి నిఖిల్, బసగళ్ల నరేందర్, మంతూరు విగ్నేష్, జంగంపల్లి గ్రామానికి చెందిన మెరుపుల విగ్నేష్, చాకలి పోషి బాలాంజనేయులు, గోత్రాల వంశీ, రామేశ్వరంపల్లి గ్రామానికి చెందిన సోమిశెట్టి నాగరాజులను మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయి తెస్తూ వారు గంజాయి వ్యసనానికి అలవాటు పడి మండలంలోని ఇతర గ్రామాలకు చెందిన అమాయక యువకులకు విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి గంజాయిని సీజ్ చేశారు. అనంతరం జ్యూడిషియల్ రిమాండ్ కోసం జైలుకు పంపారు.

గంజాయికి దూరంగా ఉండాలి : పోలీసులు

మండలంలోని యువకులంతా గంజాయి వినియోగానికి, క్రయవిక్రయాలకు దూరంగా ఉండాలని అన్ని గ్రామాల్లో అనుమానితుల కార్యకలాపాలపై నిఘా పెట్టనున్నట్టు పోలీసులు తెలిపారు. మండలంలో ఎవరైనా గంజాయి విక్రయించినా.. గంజాయి తాగినా వారిని అవసరమైతే యూరిన్ కిట్ ద్వారా వారి వినియోగాన్ని నిర్ధారించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని రిమాండ్ చేయనున్నట్టు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అద్భుతమైన కట్టడాలు

- కౌలాస్ కోటను సందర్శించిన ఎస్పీ సింధు శర్మ


కౌలాస్ కోట వద్ద పోలీసు బృందం


కోట వివరాలను తెలుసుకుంటున్న ఎస్పీ సింధుశర్మ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కౌలాస్ గ్రామంలోని కోట అందాలు, కట్టడాలు అద్భుతంగా ఉన్నాయని కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధు శర్మ అన్నారు. ఆమె ఆదివారం కౌలాస్ కోటను, కోటకు సంబంధించిన రాజ కుటుంబీకురాలు రాని అనిత సింగ్‌తో కలిసి సందర్శించారు. కౌలాస్ కోటలోని ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోటలో మూడు గంటల పాటు తిరిగి పురాతన నిర్మాణాలు, మందిరాలను, కట్టడాలను పరిశీంచారు. కౌలాస్ కోట చారిత్రక వివరాలు, కౌలాస్ గ్రామ చరిత్రను అక్కడి గ్రామస్తుడు బోడ సాయిలు ఎస్పీకి వివరించారు. కోటలో మూడు గంటల పాటు కలియ తిరిగి తొమ్మిది గజాల ఫిరంగి, హనుమాన్ మందిరం, రామాలయం, సరస్వతి మాత, వెంకటేశ్వరా మందిరం, పట్టే మంచం, తామర కొలను, మల్లికా బురుజు, ఆయుధ గారాలు, ధన్యగారాలు, కంధకాలు, తదితర వాటిని పరిశీలించారు. కోట వెలుపల ఉన్న అష్ట భుజ మాత మందిరాన్ని సందర్శించి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి. ట్రైనీ ఐపీఎస్‌లు, బాన్సువాడ, ఎల్లారెడ్డి డీఎస్పీలు, బిచ్కుంద సీఐతో పాటు కౌలాస్ గ్రామ నాయకులు అనితసింగ్, పాకాల వెంకటి, చిన్న హన్మగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేత అశోక్ కుమార్‌ను గెలిపించండి

- ఉమ్మడి ఉపాధ్యాయ సంఘాలు



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధ్యాయ ఉద్యమ నేత అశోక్ కుమార్‌ను గెలిపించాలని ఉమ్మడి ఉపాధ్యాయ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. నిజామాబాద్ టీఎస్ యుటిఎఫ్, టిపిటిఎఫ్, ఎస్సీ, ఎస్టీ, యూఎస్, టిజిఎల్‌ఏలతో పాటు పలు ఉపాధ్యాయ సంఘాలు అశోక్ కుమార్‌కు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేయబోతున్న టిపిటిఎఫ్ అభ్యర్థి అశోక్ కుమార్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్ మాట్లాడుతూ.. అశోక్ కుమార్ 36 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ టిపిటిఎఫ్‌లో మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి నాయకులుగా ఉపాధ్యాయ విద్యారంగ సంక్షేమం కొరకు నిరంతరం ఉద్యమాలు నిర్మించి విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన నాయకులుగా పేరు ప్రఖ్యాతలు గడించారని తెలిపారు. నిజాయితీకి నిబద్ధతకు నిస్వార్థతకు మారుపేరుగా నిలిచిన అశోక్ కుమార్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా సరైన అభ్యర్థి అన్నారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో అశోక్ కుమార్‌ను మొదటి ప్రాధాన్యతా ఓట్లతో గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థిస్తున్నామని తెలిపారు. యుటిఎఫ్ అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యమాలకు బాసటగా నిలిచి రాష్ట్రంలో కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయుటకు, ప్రభుత్వ విద్యాసంస్థలు బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తారని అన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ.. ఉద్యమ నాయకులను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నుకుని ఉపాధ్యాయ విద్యారంగ సంక్షేమానికి కృషి చేయాలని తెలిపారు. టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ మాట్లాడుతూ.. టీఎస్ యుటిఎఫ్, ఎస్సీ, ఎస్టీ, యుఎస్, టీజీజెఎల్‌ఏ, బిటిఎఫ్, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ ఉపాధ్యాయ సంఘాలతో పాటు కేజీబీవీ ఉపాధ్యాయ సంఘాలు మద్దతుతో పోటీ చేస్తున్న ఉపాధ్యాయలోకం ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో టిపిటిఎఫ్ నాయకులు సల్ల సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ యూనియన్ నాయకులు సుధామ్, పోషన్న, లెక్చరర్ యూనియన్ నాయకులు ప్రవీణ్ కుమార్, నరేందర్, లక్ష్మీనారాయణ, గంగా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకూ సాగునీరు

- ఇరిగేషన్ ఎస్ఈ రాజశేఖర్



నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్, నసురుల్లాబాద్ మండలంలో చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందిస్తామని బాన్సువాడ ఇరిగేషన్ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. నవతెలంగాణ పత్రికలో ఇటీవల రెండు రోజులుగా సాగునీటి సమస్యలపై కథనాలు ప్రచురితం కావడంతో ఆదివారం సాయంత్రం బీర్కూర్ మండలం దామరంచ, రైతునగర్, నసురుల్లాబాద్ మండలం మీర్జాపూర్, మైలారం గ్రామాల్లో డిప్యూటీ ఇంజనీర్ జగదీష్‌తో కలిసి పర్యవేక్షించారు. రైతులకు భరోసా కల్పించారు. రైతులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వివిధ మండలాల్లో ఉన్న పంట పొలాలకు సాగునీరు అందకపోతే స్థానిక మండల సాగునీటి అధికారులకు లేదా బాన్సువాడ సాగునీటి కార్యాలయంలో సమాచారం అందించాలని వారు కోరారు. ప్రతి గుంటకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ప్రతి గుంటకూ సాగునీరు అందిస్తామని ఆయన హామీనిచ్చారు. ఉమ్మడి మండలంలో చివరి ఆయకట్టు పంట పొలాలకు సాగునీరు అందించాలని, సాగునీటి కాలువల్లో అడ్డంకులను తొలగించాలన్నారు. ఎండాకాలం సాగునీటి కాలువల్లో ముళ్లపొదలు పెరగడం, రాళ్లు పడడం సర్వ సాధారణమని తెలిపారు. ముళ్లపొదలను, రాళ్లను తొలగించామని, పూర్తిస్థాయిలో చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామన్నారు. వీరి వెంట మండల ఇరిగేషన్ అధికారి అజాంఖాన్, ఇరిగేషన్ సిబ్బంది, మండల పరిధి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు అడ్డాగా.. వర్ని సెంటర్

- ఎటు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియక అయోమయం
- పలుమార్లు చోటుచేసుకున్న ప్రమాదాలు
- సిగ్నల్ ఏర్పాట్లు చేయాలని కోరుతున్న ప్రజలు


చౌరస్తాలో చోటుచేసుకున్న ప్రమాదం

నవతెలంగాణ-వర్ని

వర్ని మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తా ప్రమాదాలకు అడ్డాగా మారింది. వాహనాలు ఎటు నుంచి ఎటు వైపునకు వస్తాయో తెలియక అయోమయం చోటుచేసుకుంటుంది. సిగ్నల్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయి.

బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ ప్రాంతాలకు వెళ్లేందుకు వర్ని మండల కేంద్రం కీలకం. ఈ రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అయితే రోడ్డుపై ఎటు నుంచి ఎటు వైపు వాహనాలు వస్తున్నాయో తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కనీసం ట్రాఫిక్ నిబంధన బోర్డులైనా ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరగబోవని, వాహనాల వేగం తగ్గుతుందని వాహనాదారుల నుంచి ప్రజల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారులు వెంటనే స్పందించి సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయాలని, అలాగే సూచిక బోర్డులు సైతం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిజాంసాగర్ ప్రధాన కాలువలో ఒకరు గల్లంతు


విట్టల్ (ఫైల్)

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం అన్నసాగర్ గ్రామ నివాసి అయిన కర్రే విట్టల్(40) మహమ్మద్‌నగర్ నుంచి గున్కులు వెళ్లే దారిలో గల నిజాంసాగర్ ప్రధాన కాలువలో చేపలు కనబడడంతో పట్టుకోవడానికి కాలువలో దిగి ప్రమాదవశాత్తు అందులోనే పడిపోయాడు. యాసంగి పంట సాగు కోసం ఇటీవలే మూడో విడత నీటిని విడుదల చేయడంతో ప్రధాన కాలువ నిండా నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో విట్టల్ కాల్వలో గల్లంతయ్యాడని ఫిర్యాదు రాగా.. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని విట్టల్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన కాలువ నిండా నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో నీటి విడుదలను నిలిపివేశారు.

చింతలగుట్ట సమీపంలో ఎలుగుబంటి సంచారం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని చింతలగుట్ట సమీపంలో శనివారం రాత్రి ఎలుగుబంటి సంచరించడంతో గిరిజనులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని మేంగారం, చింతలగుట్ట తండాల శివారులో శనివారం రాత్రి తండాకు వెళ్లే రహదారిపై ఎలుగుబంటి కనిపించడంతో గిరిజనులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. గత సంవత్సరం చింతలగుట్ట తండాలోనికిని చెరువులో నీళ్లు తాగడానికి ఎలుగుబంటి రావడంతో అధికారులు ఎలుగుబంటిని బంధించడానికి ప్రయత్నాలు చేసిన ఫలితం లేకుండా పోయింది. ఎలుగుబంటి సంచరించడంతో రాత్రివేళ వాహనదారులు రోడ్డుపై వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. వెంటనే అటవీశాఖ అధికారులు సకాలంలో స్పందించి ఎలుగుబంటిని అటవీ ప్రాంతానికి తరలించాలని పలువురు కోరుతున్నారు.

ఆర్య క్షత్రియ సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి ఆర్య క్షత్రియ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. అధ్యక్షునిగా జంగల్ దేమీ రామచంద్రరావు, ఉపాధ్యక్షులుగా నాగులూరి కిషన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా గడిల గోవిందరావు, కోశాధికారిగా వాంకోజీ గోపాల్ రావును ఎన్నుకోగా.. సలహాదారులుగా మరికొందరని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర కాలనీలో పారిశుధ్యం అధ్వానం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలో డివిజన్ నెంబర్-16 అరబిందో స్కూల్ పక్కనగల వెంకటేశ్వర కాలనీ, దుబ్బ, డ్రైనేజీ సరిగా లేక కాలనీలోనే ఫ్లాట్స్‌లలో మురికి నీరు చేరి దుర్వాసన వస్తుంది. దోమలు పెరగడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు, ఇకనైనా అధికారులు పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు,

క్రీడల్లో గెలుపోటములు సహజం



నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ కేంద్రంలోని కృషి పబ్లిక్ హైస్కూల్ గ్రౌండ్‌లో వారం రోజులుగా ముత్యాల సమన్వి స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ క్రీడలలో సత్తా చాటిన టీంలకు ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్లో భీంగల్ 11 టీం విన్నర్‌గా, బాబాపూర్ టీం రన్నర్‌గా, తృతీయ బహుమతి శ్రీరామ్ యూత్ గెలుచుకున్నారు. క్రీడలలో సత్తా చాటి గెలిచిన క్రీడాకారులకు సర్వ సమాజ్ కమిటీ అధ్యక్షులు నీలం రవి బహుమతులు అందజేశారు. దీనికి ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ కర్నే సురేందర్ ప్రేమలత, యూత్ కాంగ్రెస్ నాయకులు వక మహేష్, స్థానిక వ్యాపారవేత్త జొన్నల భూపాల్, మహేష్, స్థానిక సీనియర్ క్రికెటర్ రాజేశ్వర్, సురేందర్, మధు,మేనేజ్మెంట్ ఆర్గనైజర్ రేహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్సపల్లి గ్రామంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఇస్సాపల్లి గ్రామంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీలక్ష్మి పద్మావతి వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నేరెళ్ల నరసింహమూర్తి మాట్లాడుతూ రామానుజాచార్యులు శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉండడం విశేషమని, ఇక్కడి ఆలయానికి 800 ఏళ్లకు పైగా చరిత్ర ఉందన్నారు. ఇటువంటి క్షేత్రం తెలంగాణలోనే ప్రత్యేకమైనదని, తిరుపతిలో ఏ విధంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయో ఇక్కడ కూడా అదే విధంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

యాదగిరి అన్న స్ఫూర్తితో విప్లవోద్యమాలను నిర్మిద్దాం

- అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బి దేవరాం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తొలితరం విప్లవోద్యమ నేత కామ్రేడ్ కర్నాటి యాదగిరి అన్న అని, ఆయన స్ఫూర్తితో బలమైన విప్లవోద్యమాలను నిర్మించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకే ఎస్) రాష్ట్ర కార్యదర్శి బి. దేవరాం పిలుపునిచ్చారు. నిజామాబాద్ పట్టణంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు: కామ్రేడ్. యాదగిరి అన్న జిల్లాలో విప్లవోద్యమ నిర్మాణంకు పునాదులు వేసిన మూల స్థంభం లాంటి వారని అన్నారు. అనేక మంది కార్యకర్తలను తీర్చిదిద్ది అందరికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. మోర్తాడ్ సిరికొండ మండలాలతో పాటు భీంగల్ పాత తాలూకాలో పెత్తందారుల దోపిడీకి వ్యతిరేకంగా బలమైన విప్లవ పోరాటాలను నిర్మించిన కమ్యూనిస్టు యోధుడని అన్నారు. కులవివక్షకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాణంకోసం కృషి చేసాడని ఆయనను స్మరించుకోవడం అంటే విప్లవ పోరాటాలను నిర్మించడమే అన్నారు. కార్యక్రమంకు ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.గోదావరి, అరుణోదయ సంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. గంగాధర్, ప్రగతిశీల ప్రసంగించారు. జిల్లా నాయకురాలు కామ్రేడ్. జయప్రద అధ్యక్షత వహించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు వి. సత్తెమ్మ, సహాయ కార్యదర్శి బి. నాగమణి, కాలనీ అధ్యక్షులు డాక్టర్. సత్యనారాయణ, గంగాధర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చెక్కు అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలకేంద్రానికి చెందిన ఆమెడ నరేందర్‌కు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కును ఆదివారం అందజేశారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం తీసుకున్న నరేందర్ ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ చొరవతో ప్రభుత్వం రూ.60వేల ఆర్థిక సహాయం చెక్కును మంజూరు చేసింది. ఆ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేందర్ ఇంటికి వద్దకు వెళ్లి అందజేశారు. ఆర్థిక సహాయం చెక్కు మంజూరు చేసిన ముత్యాల సునీల్ కుమార్‌కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లబ్ధిదారు నరేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకల బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, ఉట్నూరి ప్రదీప్, వేముల గంగారెడ్డి, నల్ల గణేష్ గుప్తా, నల్ల సాయికుమార్ గుప్తా, అబ్బత్ హుస్సేన్, నరేందర్, అజారుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన సునీల్ రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంగ భూమన్న ఇటీవలే కాలుకు సంబంధించిన చికిత్స చేయించుకోగా, విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి ఆదివారం భూమన్న ఇంటికి వెళ్ళి అతడిని పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగారెడ్డి సంజీవ్, సామ్సన్, తదితరులు పాల్గొన్నారు.

'సహకారం' మరింత విస్తృతం

- 19న పూర్తికానున్న సొసైటీ పాలకవర్గాల పదవీకాలం



ప్రాథమిక వ్యవసాయ కేంద్రం సహకార సంఘం

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లను మరింత బలోపేతం చేసి వాటి ద్వారా రైతులకు విస్తృతంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో సహకార వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం మార్పులు తేవాలని భావిస్తుంది. ప్రజలు రైతులతో ఎక్కువ సంబంధాలు కలిగిన సొసైటీలను బలోపేతం చేయాలని, వాటి పరిధిని ప్రతి మూలకు విస్తరింప చేయాలని సహకార వ్యవస్థలు డిజిటలైజేషన్ చేయాలని సహకార శాఖకు ఆదేశాలు అందాయి. ప్రతి సంఘానికి సంబంధించిన లావాదేవీలు ఆడిట్ రిపోర్టులను ఆన్లైన్లో ఎంట్రీ చేయడం పూర్తికాగా, వచ్చే నూతన పాలకవర్గంతో పాటు సహకార వ్యవస్థలో మార్పులు తెచ్చి ఆర్థికపర సహకారాన్ని కూడా అందించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

నూతన సంఘాల ఏర్పాటుకు కసరత్తు..

నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, జిల్లాలోని కొత్త సొసైటీలు కావాలని భీంగల్, సిరికొండ, నందిపేట తదితర మండలాల నుంచి సహకార శాఖకు వినతులు అందినవి. జిల్లాలోని లక్ష్మీపూర్, పడగేపల్లి, వన్నెల్‌బి, జన్నేపల్లి, సిద్దాపూర్, తగిలెపల్లి, దేగాం, తిమ్మాపూర్, కొత్త సొసైటీలు ఏర్పాటు చేయాలని ఆయా నియోజకవర్గాల పరిధిలోని ప్రజా ప్రతినిధులు సైతం లేఖలను పంపినారు.

జిల్లాలో 89 సొసైటీలు ఉండగా..

జిల్లా వ్యాప్తంగా 89 సొసైటీల పరిధిలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. 2.70 లక్షల మంది రైతులు సభ్యులుగా సొసైటీల ద్వారా రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు అందించడంతోపాటు రుణాలు కూడా అందిస్తున్నారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు ఇతర కార్యక్రమాలు సైతం సొసైటీల ద్వారానే అమలైనవి.

రైతన్నలకు సేవలందించాం..



జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రావు ఆదేశానుసారం సొసైటీ పరిధిలో రైతులకు కావలసిన అన్ని సేవలను అందించాం. వైస్ చైర్మన్ తూర్పు చిన్న రాజన్న, సొసైటీ సీఈఓ బొడ్డు రమేష్, డైరెక్టర్లు, సిబ్బంది నిర్విరామ కృషి చేశారు.

బంటు మహిపాల్, పిఏసిఎస్ చైర్మన్, గోవింద్ పెట్

అయితే జిల్లాలో 2013 సంవత్సరం తర్వాత కొత్తగా వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు కాలేదు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు ,గ్రామ పంచాయితీలు ఏర్పడినప్పటికీ సహకార సంఘాల విభజన మాత్రం జరగలేదు. ఓకో సొసైటీ రెండు మండలాల పరిధిలోకి రావడం, అలాగే ఎక్కువ గ్రామాలకు ఒకే సొసైటీ ఉండడంతో సరైన సేవలందిగా రైతులు ఇబ్బందులు పడ్డారు.

ఈనెల 19తో ముగియనున్న పదవీకాలం...

జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని పాలకవర్గాల పదవీకాలం ఈనెల 19 బుధవారంతో ముగియనుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోని సొసైటీ డైరెక్టర్లతో పాటు చైర్మన్‌ల పదవీకాలం ముగియానుంది.. ఐదేళ్లు పూర్తవుతున్న సమయంలో ఎన్నికలు నిర్వహించి మళ్లీ కొత్త పాలకవర్గం సభ్యులను ఎన్నుకొని అవకాశం ఉంది. పదవీకాలం పూర్తయిన తర్వాత పర్సన్ ఇన్చార్జిలను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

- సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్
- ఫెడరేషన్ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి
- సంఘానికి సభ్యత్వమే కీలకం
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



మాట్లాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సోమయ్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుల మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టులకు మరిన్ని గడ్డు పరిస్థితులు ఏర్పడే ప్రమాదముందని, ఈ విషయంలో జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. సమస్యలపై పోరాటాలు చేసేందుకు ఫెడరేషన్ నాయకత్వం సిద్ధం కావాలని సూచించారు. ఆదివారం నిజామాబాద్ నగరంలో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో గానీ,దేశంలో గానీ రాను రాను జర్నలిస్టుల హక్కులు హరింపబడుతున్నాయని, పాలకులు ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా దాటవేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు సార్లు అధికారంలో కొనసాగిన గత ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పూర్తిగా విస్మరించి తీరని అన్యాయం చేశాయని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వలేక పోయిందని, జీవో 239 సమీక్ష పేరుతో కమిటీ వేసి కాలయాపన చేస్తుందని విమర్శించారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, పెన్షన్ స్కీం, హెల్త్ కార్డులు, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీలు, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తదితర డిమాండ్ల సాధనకై ఫెడరేషన్ ఆధ్వర్యంలో బలమైన ఉద్యమాలు చేయాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. ఫెడరేషన్ నిజామాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ, ఫెడరేషన్ బలోపేతానికి ప్రతి జిల్లా, నియోజకవర్గాల్లో జర్నలిస్టులంతా కలిసిరావాలని, సభ్యత్వ నమోదు ద్వారా సంఘాన్ని బలోపేతం చేసి ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

అడ్‌హక్ కమిటీ ఎన్నిక...

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నిజామాబాద్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. కన్వీనర్‌గా కుంచం శ్రీనివాస్(ప్రజా జాగృతి), కో-కన్వీనర్లుగా పానుగంటి శ్రీనివాస్(జన ప్రజావాణి), రామచంద్రారెడ్డి(సాక్షి), కోరి రాకేష్(ఆంధ్రజ్యోతి), రాజేందర్ (నమస్తే తెలంగాణ), లక్ష్మణ్, అనిత (నవ తెలంగాణ), పరమేశ్వర్(ప్రజాదర్బార్), శ్రీకాంత్ (ఆదాబ్ హైదరాబాద్), రాజేందర్ పటేల్, టి. రాజేష్ తదితరులు ఎన్నికయ్యారు. అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి జిల్లా మహాసభ, నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియను జరపాలని సమావేశం తీర్మానించింది.

అంబేద్కర్ దళితసేవా సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంబేద్కర్ దళితసేవా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో గల అంబేద్కర్ దళిత సేవా సంఘం భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అంబేద్కర్ దళితసేవా సంఘం అధ్యక్షులుగా ఎస్.సాయిలు, జె.నాగేష్, ఉపాధ్యాక్షులుగా ఎన్.సుధాకర్, జి.సాయి కుమార్, కార్యదర్శిగా ఎన్.రాజ్‌కిరణ్, కె.శ్యామ్, క్యాషియర్‌గా ఇ.మహేష్‌బాబు, సలహాదారులుగా జి.ఒడ్డెన్న, ఇ.నర్సయ్య, బి.యాదగిరి, కె.గంగాధర్, జి.రవికుమార్, కె.నాగేష్, బి.బాలరాజును ఎన్నుకున్నారు.

రఘునాథ ఆలయ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా చెరువుపల్లి గురు ప్రసాద్



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

శ్రీ రఘునాథ ఆలయ చారిటబుల్ ట్రస్ట్ ప్రత్యేక సమావేశం ఆదివారం ఖిల్లా రామ మందిర్‌లో ముక్క దేవేందర్ గుప్తా చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఇంతవరకు ట్రస్ట్ ద్వారా జమ ఖర్చులు వివరాలను ఆడిటర్ ద్వారా చేయించి సభలో సమర్పించారు. సభ్యులు ఆమోదం తెలిపిన రఘునాథ ఆలయం చారిటబుల్ ట్రస్ట్ శాశ్వత సభ్యుల వివరాలు, ఆలయ చరిత్ర, పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు, అన్నదాన కమిటీ, మొదలైన వాటిపై ఒక కరదీపిక వెలువరించాలని తెలిపారు. ముక్క దేవేందర్ గుప్తా ఆలయ కమిటీ చైర్మన్ పదవీకాలంలో నిర్వహించిన కార్యక్రమాల గురించి తెలిపారు. ఆలయం నిర్వహణలో లోటుపాట్లను సరిచేసి ఇంకా సమర్థవంతంగా నిర్వహించుటకు ట్రస్ట్ సభ్యులు తమ సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో గురు ప్రసాద్, కొండ వీరశేఖర్ గుప్తా, రాజేంద్ర ప్రసాద్ , గంట లింగం, అంబాదాసురావు, పెండ్యాల శ్రీనివాస్ గుప్తా, అశోక్, తాటి వీరేశం, చల్ల గంగాధర్, జి రాజశేఖర్ గుప్తా, భూమ లింగం గుప్త, వి. నారాయణ, బచ్చు సంతోష్, పడగల నాగనాథ్ గుప్తా, శంకర్ తదితరులు 50 మంది ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. ముక్కా దేవేందర్ గుప్తా తన పదవీకాలంలో నిర్వహించిన లెక్కలను కమిటీకి అప్పగించారు. నూతనంగా రఘునాథ ఆలయ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా చెరువుపల్లి గురు ప్రసాద్ టాక్స్ కన్సల్టెంట్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రస్ట్ సభ్యులందరూ ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులను గౌరవాధ్యక్షులుగా అంగీకరించుటకు కోరారు. త్వరలోనే నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకొని పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. పదవి విరమణ చేసిన చైర్మన్ ముక్క దేవేందర్ గుప్త కి నూతన చైర్మన్ చెరువుపల్లి గురుప్రసాద్‌కు ట్రస్టు సభ్యులు ఘనంగా సన్మానించినారు. దేవాలయ రోజువారీ కార్యక్రమాల నిర్వాహణలో సహకరిస్తున్న పూజారిని పోశెట్టి అభినందించారు.

ఐకమత్యానికి మారు పేరు అర్సపల్లి

- వ్యవసాయ కమిషన్ మెంబర్ గడుగు గంగాధర్




మాట్లాడుతున్న వ్యవసాయ కమిషన్ మెంబర్ గడుగు గంగాధర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఊరంతా ఐకమత్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ పిలుపునిచ్చారు. ఏ ప్రాంతమైనా ఏ గ్రామమైనా సమిష్టి కృషి తో ముందుకు వెళ్తే అభివృద్ధి సాధ్య మని సూచించారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు ఆ ప్రాంత ప్రజల మన్ననలు అందుకున్నప్పుడే ఆ పదవికి సార్థకత ఉంటుందని అన్నారు. నిజామాబాద్ నగర శివారులోని 15 వ డివిజన్ అర్సపల్లిలో మాజీ కార్పొరేటర్ లావణ్య నవీన్ దంపతులకు ఆత్మీయ సన్మాన సభ ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, రాంభూపాల్, ప్రీతం మాజీ కార్పొరేటర్లు నర్సుబాయి,రఘువీర్, బాల్ కిషన్ గ్రామ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. లావణ్య దంపతులను ఘనంగా సన్మానించారు జ్ఞాపికను అందజేశారు. పూర్తిగా గ్రామీణ వాతావరణం కలిగిన అర్సపల్లిలో గత ఐదేళ్లుగా అనేక అభివృద్ధి పనులు జరిగాయని గడుగు గంగాధర్ గుర్తు చేశారు. కొట్లాడి నిధులు తెచ్చినపుడే ప్రజలు తమను గుర్తిస్తారని ఎన్నికల్లో ఆదరిస్తారని చెప్పారు. డివిజన్‌లో సుమారు 20 కోట్ల పనులు జరగడం విశేషమని కొనియాడారు. అభివృద్ధిని గుర్తించి గ్రామస్తులు సన్మాన సభ ఏర్పాటు చేయడం అభినందనీయమని గంగాధర్ అన్నారు. రైతు సమస్యలు తన దృష్టికి తెస్తే కమిషన్ ద్వారా ప్రభుత్వంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాకారులు సిర్ప లింగం, సవిత బృందం ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. గ్రామ కమిటీ ప్రతినిధులు సిర్ప నాగయ్య, గౌరారం సాయిలు, గంగాధర్, రాజన్న, అబ్బయ్య, సిర్ప కిరణ్ పాల్గొన్నారు.

ఇస్సాపల్లిలో సంబరాలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఇసపల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో మోడీ నాయకత్వంలో ఢిల్లీ లో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా ఆదివారం పటాకులు కాల్చి, విజయోస్తు కార్యక్రమం జరుపుకున్నారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధికారప్రతినిధి కలిగోట గంగాధర్ మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలు ఆప్ పార్టీని చీపురతో ఊడ్చి కాంగ్రెస్ పార్టీ అవినీతికి ఆజ్యం పోస్తుందని, మంచి పాలన ప్రజలకు ఇవ్వదని బీజేపీకి పట్టం కట్టరాని అన్నారు. ఢిల్లీ ఆర్కే పురం నియోజకవర్గం ఇంచార్జిగా లోకసభ సభ్యులు అరవింద్ అన్న ఇంచార్జ్‌గా ఉంటూ ప్రచారం చేసి విజయం సాధించారాని అన్నారు. నిజామాబాదు జిల్లా నుండి పసుపు బోర్డు జాతీయ చైర్మెన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ నాయకులు వెళ్లి ఢిల్లీలో ప్రచారం చేశారని, మన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలిచ్చి గద్దె నెక్కిన తరువాత హామీలు విస్మరించి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. మోసపూరిత కాంగ్రెస్ పార్టీ కి రాబోయే స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బండి శ్రీ హరి, ధార్ల చిన్న ముతేన్న, బీజేపీ బూత్ అధ్యక్షులు బాగాయి సురేష్, బాను చందర్, శెట్పల్లి ముతేన్న, ఉమ్మడి చిన్నయ్య, బొంత పున్నం, చిరంజీవి, సాయిరెడ్డి, ముతేన్న శ్రీకాంత్, ముతేన్న గార్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండి శ్రీ హరి, ధార్ల చిన్న ముతేన్న బీజేపీ బూత్ అధ్యక్షులు బాగాయి సురేష్, బాను చందర్, శెట్పల్లి ముతేన్న, ఉమ్మడి చిన్నయ్య, బొంత పున్నం, చిరంజీవి, సాయిరెడ్డి, ముతేన్న, శ్రీకాంత్, ముతేన్న పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ శిక్షణకు క్రీడాకారిని సానియా ఎంపిక



నవతెలంగాణ-గాంధారి

జాతీయస్థాయి వాలీబాల్ శిక్షణకు సానియాను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించే 6 వారాల క్రీడ శిక్షణలో భాగంగా గాంధారి మండలం పెట్‌సంగెం గ్రామ పంచాయతీ పరిధిలోని ధన్‌సింగ్ తండాకు చెందిన జరప్లా సోనియా ఈ నెల 10 నుంచి 25 వరకు బెంగుళూర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ క్రీడా ప్రాధికార సంస్థలో నిర్వహించే శిక్షణకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారిణి అయిన సోనియా ఇటీవలే వ్యాయామ విద్య పూర్తి చేసింది. జాతీయ స్థాయి కోచ్ కావడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

డాక్టర్ బాలుకు జాతీయ సేవా పురస్కారం

- అందజేసిన ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు



నవతెలంగాణ-కామారెడ్డి

జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చిలకలూరిపేటలో నిర్వహించిన జాతీయ సేవా పురస్కారం 2025ను డాక్టర్ బాలుకు చిలకలూరిపేట్ ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నిర్వహణ కార్పొరేషన్ చైర్మన్ పాలంరెడ్డి దినేష్ రెడ్డిలు అందజేశారు. ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తూ, వ్యక్తిగతంగా 75 సార్లు రక్తదానం చేయడమే కాకుండా, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నాలుగు వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నందుకు గాను ఈ పురస్కారాన్ని డాక్టర్ బాలు పొందారు.



పెద్దకొడప్‌గల్: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు



రామారెడ్డిలో...



వర్నిలో...

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

- తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న విద్యార్థులు
- ఆనాటి ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2001-2002 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిల్లో ఉన్నవారు అందరూ హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత అప్పట్లో చదువుకున్న మిత్రులను కలవడం చాలా సంతోషకరమని ఈ పాఠశాలల్లో చదివి కొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రైవేటు రంగాల్లో రాజకీయ రంగాల్లో రాణిస్తున్నామని క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని అన్నారు. తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులకు గుండెరావు, చంద్రశేఖర్, సరిత, శ్రీనివాస్, ఉపాధ్యాయులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు సలీం, శ్రీహరి, శంకర్‌గౌడ్, రాజు, సాయిలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామారెడ్డి : ఒకటే బడిలో పదవ తరగతి వరకు చదివి.. 40 ఏండ్ల తర్వాత చదువు నేర్పిన గురువులతో కలిసి ఒకే వేదికను పంచుకొని ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. మండలంలోని ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఉప్పల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించి, చదువు నేర్పిన గురువులకు శాలువాలతో సన్మానించి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. 40 సంవత్సరాల తర్వాత చదువుకున్న రోజుల్లోని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని అందరూ ఒకే వేదికపై సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ వెంకటి, డి.తిరుపతిరెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్ నరసింహారెడ్డి, పూర్వ విద్యార్థులు నారెడ్డి మోహన్‌రెడ్డి, పి.లింగమూర్తి, ఎల్.రవి, బిక్షపతి రెడ్డి, ఎస్.గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, ఎన్.శోభారాణి, కాల హనుమాన్లు, జి.వినోద, ఎస్.విజయ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

వర్ని (చందూర్) : మండలంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 2000-21 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం 24 ఏండ్ల తరువాత ఒక చోట కలుసుకొని తమ ఉద్యోగం, హెూదాను మరిచిపోయి చిన్న పిల్లల కేరింటాలతో తమ యోగ క్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. పాఠశాల ప్రాంగణం కొలహాలంగా మారిపోయింది. ఈ సమ్మేళనంలో నాటి గురువులకు పుష్ప గుచ్ఛలు అందించి, శాలువాలతో సన్మానించారు. సమ్మేళనానికి పలువురు హాజరై గుర్తు చేసుకొన్నారు. నాడు గురువులు చేపిన చదువు, క్రమశిక్షణ ఈనాడు తాము ఈ స్థాయిలో ఉన్నామని ఒకొక్కరిగా చెప్పుకొచ్చారు. పూర్వ విద్యార్థుల ఆటలు, పాటలు అలరించాయి. వచ్చిన విద్యార్థులు పొద్దుపాయే వరకు గడిపి బరువు వెక్కిన హృదయలతో ఎవరి గమ్యస్థానాలకు వారు కదిలారు. ఈ కార్యక్రమంలో కరెంగాం మాజీ సర్పంచ్ దేవుసింగ్, గుండూర్ శేఖర్, బెల్లం రవి, అంబులెన్సు రవి, హైమద్ పలువురు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పోతంగల్: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పోతంగల్ : మండలంలోని కారెగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు.. 20 సంవత్సరాల తరువాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఇన్నేండ్ల తర్వాత నాటి స్నేహితులను కలుసుకున్నందుకు.. ఆనందంగా గడిపారు. ఆత్మీయంగా పలుకరించుకుని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాల నాటి తీపిగుర్తులను నెమరు వేసుకున్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని దొంగిలించిన దుండగులు

నవతెలంగాణ-జుక్కల్



మండలంలోని డోన్‌గావ్ నుంచి సోపూరు వెళ్లేదారిలో శక్తినగర్ టీ జంక్షన్ వద్ద నుంచి గుర్తు తెలియని దుండగులు శనివారం శివాజీ విగ్రహాన్ని దొంగిలించినట్టు ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఆరు సంవత్సరాల క్రితం శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఫీట్ల శివాజీ విగ్రహాన్ని దొంగిలించారని గ్రామస్తుల నుండి సమాచారం రావడంతో వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్టు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైభవంగా మల్లికార్జున కళ్యాణం



మల్లికార్జున కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని బ్రహ్మాజీవాడి గ్రామ సమీపంలో ఆదివారం మల్లికార్జున స్వామి కళ్యాణం వైభవంగా జరిపించినట్లు యాదవ సంఘం సభ్యులు తెలిపారు. గత వారం రోజుల నుంచి మల్లికార్జున స్వామి ఉత్సవాలు జరుపుతున్నామని ఆదివారం భాజాభజంత్రీలతో వేద పండితులచే మల్లికార్జున స్వామి కళ్యాణం జరిపి వడి బియ్యం మార్చుకుని నూతనంగా నిర్మించిన ఆలయంలో యాదవ సంఘం సభ్యులు వారి ఆరాధ్య దైవమైన స్వామివారి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాలు సోమవారంతో ముగియనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న గొల్ల రాములు, శెట్పల్లి లింగం యాదవ్, పెద్ద గొల్ల ఎల్లయ్య యాదవ్, పెద్ద గొల్ల సాయిలు, మోతే ఎల్లయ్య యాదవ్, సంజీవులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

17న బాల త్రిపుర సుందరి దేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

- మాజీ వైస్ ఎంపీపీ బిల్లా రామ్మోహన్

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామంలో నిర్మించిన శ్రీ శ్రీ బాల త్రిపుర సుందరి దేవి ఆలయ అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని స్థానిక గ్రామపెద్దలు, యువతీ యువకులను మాజీ వైస్ ఎంపీపీ బిల్లా రామ్మోహన్ కోరారు. ఈనెల 15న శనివారం స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా అమ్మవారి గుడి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన యువతను కోరారు. 17న బాల త్రిపుర సుందరి దేవి గుడి ద్వితీయ వార్షికోత్సవం శుభ సందర్భంగా ఉదయం వేద పండితుల మధ్య ఉత్సవ కార్యక్రమాలను గ్రామస్తులందరం కలిసి విజయవంతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

ఎల్లారెడ్డి వాసికి జాతీయ సేవ పురస్కారం అందజేత



నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి మండల కేంద్రంలో చెందిన జమీల్ అహ్మద్‌కు జాతీయ సేవ పురస్కార అవార్డును ఆదివారం అందజేశారు. జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చిలకలూరిపేటలో నిర్వహించిన జాతీయ సేవా పురస్కారం 2025 కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు జమీల్ హైమద్‌కు ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నిర్వహణ కార్పొరేషన్ చైర్మన్ పొలంరెడ్డి దినేష్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, వ్యక్తిగతంగా 27 సార్లు రక్తదానం చేయడమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి సకాలంలో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నందుకు గానూ జమీల్ హైమద్‌కు ఈ పురస్కారాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన కామారెడ్డి రక్తదాతల సమూహానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రక్తదానం చేయడం ప్రాణా ప్రయాణ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోసినట్లన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని వారన్నారు.

వాహనం ఎవరిదో..?

నవతెలంగాణ-తాడ్వాయి



మండలంలోని కొత్తజ వాడి బస్టాండ్ ప్రాంతంలో ద్విచక్ర వాహనం పార్కింగ్ అయి ఉన్నట్టు గ్రామస్తుల తెలిపారు. గత 12 రోజుల నుంచి 25 ఎఫ్ 5905 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పార్కింగ్ చేసి వెళ్లారని చెప్పారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లారా..?, లేదా ఏదైనా స్మగ్లింగ్ చేస్తూ పట్టుపడతామనే ఉద్దేశ్యంతో వదిలి వెళ్లారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దాతకు సన్మానం

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయానికి ట్యాంకు బహూకరణ దాతకు ఆదివారం సన్మానించినట్లు ఉపాధ్యాయులు దమ్మనగారి సంగారెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణలో తాగునీటి సౌకర్యం ఇబ్బందులు గమనించిన స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు రామగోనోళ్ళ రాజాగౌడ్, రూ.25వేల విలువ గల తాగునీటి ట్యాంకును బహూకరించారు. దీంతో నీటి సమస్యలు తొలగిపోయాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి మరిన్ని సహాయ సహకారాలు అందించాలని గ్రామపెద్దలు వివరించారు. అనంతరం దాతకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిడిసి మాజీ చైర్మన్ మద్ది మహేందర్ రెడ్డి, ఏనుగు రాఘవరెడ్డి, దూడం శివాజీ, సురుకంటి సుధాకర్ రెడ్డి, జె.బాగారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహెూత్సవం

- కొనసాగుతున్న జాతర బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేట్ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 5న ప్రారంభమైన ఉత్సవాలు 13 వరకు భక్తిశ్రద్ధలతో కొనసాగుతాయి. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యం మేరకు, అలాగే పవిత్ర (అష్టముకి) కోనేరు పుష్కరిణి వద్ద ఆలయ అధికారులు బారీకేడ్లను ఏర్పాటు చేశారు. స్వామివారి దర్శనానికి భక్తులు ఇబ్బందులు పడ కుండా ఆలయంలో పురుషులకు స్త్రీలకు (భక్తులకు) వేరు వేరుగా భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. ఉత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం స్వామివారి విగ్రహం మూర్తులను పల్లకి సేవలో ఆలయ ఆవరణలో వేద మంత్రాలతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈనెల 10న ఉదయం యజ్ఞం బలి హారం, లాజరోహనం, హారతి మంత్ర పుష్పం తీర్థ ప్రసాదన్న వితరణతో పాటు సాయంత్రం భక్తుల సౌకర్యం మేరకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యనిర్వ ణాధికారి గింజుపల్లి వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు తెలిపారు.



పల్లకిలో పాల్గొన్న భక్తులు

ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులుగా సంతోష్ కుమార్

నవతెలంగాణ-లింగంపేట్

ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులుగా బ్రాహ్మణపల్లి సంతోష్ కుమార్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం మండల కేంద్రంలోని రామ మందిరంలో అధ్యక్ష కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కామారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కంచర్ల బాలకిషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. లింగంపేట్ మండలంలోని మోతే గ్రామానికి చెందిన బ్రాహ్మండ్లపల్లి సంతోష్ కుమార్‌ను అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చింతల రాజు, కార్యదర్శిగా జక్కని ప్రవీణ్, సహాయ కార్యదర్శిగా ఉప్పల గంగాధర్, కోశాధికారిగా చింతగారి సంతోష్ కుమార్‌తో పాటు సలహాదారులను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు పేరుపేరునా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తానని అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

అనంతరం జిల్లా అధ్యక్షులు కంచర్ల బాలకిషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులకు శాలువాలు కప్పి పూలదండ వేసి ఘనంగా సన్మానించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు నారాయణ, రవి, శ్రీనివాస్, దుర్గయ్య, సంతోష్, పవన్, అరుణ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ

పాదయాత్ర భక్తులకు పండ్లు అందజేత

- ఏఎంసి వైస్ చైర్మన్‌కు ఘన సన్మానం



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో గల శ్రీ సాయిబాబా ఆలయం నుండి పాదయాత్రగా బయలుదేరిన భక్తులకు డోంగ్లి మండలంలోని మోగా గ్రామంలో పాదయాత్ర భక్తులకు మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ ఆ గ్రామస్తులు కలిసి పండ్లు ఆదివారం అందజేశారు. పాదయాత్ర భక్తులు పండ్లు ఫలాలు అందజేసిన మద్నూర్ ఎఎంసి వైస్ చైర్మన్‌కు శాలువాతో ఘనంగా సన్మానించారు ప్రతి సంవత్సరం మద్నూర్ షిరిడి సాయిబాబా ఆలయం నుండి నెమలి సాయిబాబా ఆలయానికి పాదయాత్ర భక్తులు చేపట్టడం ఎంతో సంతోషకరమని ఏఎంసి వైస్ చైర్మన్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-భిక్కనూర్



భిక్కనూర్ పట్టణ కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి మాట్లాడుతూ.. బీసీలకు 46శాతం రిజర్వేషన్ కల్పించినందున బీసీ సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయడం జరిగిందని రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు గాను బీసీ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ భూమిరెడ్డి, నరసింహారెడ్డి, మైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీసీ సంఘం అధ్యక్షులు తిరుమల స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు నర్సాపూర్‌లో విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-బోధన్



బోధన్ మున్సిపల్ పరిధిలోని నర్సాపూర్‌లో సోమవారం ఉదయం పోచమ్మతల్లి గ్రామ దేవత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్ మాన్ని నిర్వహించనున్నట్టు కాలనీ పెద్దలు జాదవ్ ప్రవీణ్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే భక్తుల కోసం అన్నదానం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి ద్రోణగిరి గుట్ట జాతర ఉత్సవాలు

నవతెలంగాణ-ముప్కాల్

శ్రీ శివ శ్రీనివాస ద్రోణగిరి గుట్ట దేవస్థానం ఉత్సవాలు ఈ నెల 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు ముప్కాల్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరుగుతాయని కమిటీ అధ్యక్షులు సిద్ధ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అందుకుగాను స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ తమవంతు సహకారాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. ఈ నెల 12న స్వామి వారి కళ్యాణం, అనంతరం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సెక్రటరీ నేర నర్సయ్య, కోశాధికారి ముస్కు చిన్న నర్సయ్య, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు..

తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ను జక్రాన్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌ను మండల కాంగ్రెస్ నాయకులు కాట్పల్లి నర్సరెడ్డి, వినోద్, లక్ష్మణ్, జితేందర్, శ్రీనివాస్ గౌడ్, సురేష్, రూపాల గంగారెడ్డి, జేడీ మల్లేష్, తెల్లన్న కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నేడు మిసైల్స్ మోడల్స్ ప్రదర్శన

నవతెలంగాణ-నందిపేట్

రానున్న నేషనల్ సైన్స్ డేని పురస్కరించుకొని కలాం ఇనిస్టూట్ ఆఫ్ యూత్ ఎక్సలెంట్ వారి సహకారంతో డీఆర్‌డీఓ, ఇస్రోలలో తయారైన మిసైల్స్, సాటిలైట్స్ మంగళ్యాన్, ఆర్యభట్ట బ్రహ్మోస్, చంద్రయాన్ ఇలా దాదాపు 20 మోడల్స్‌ను సోమవారం మండలకేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో ప్రదర్శించనున్నట్టు గోజూరి అరుణ్ నియో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కరస్పాండెంట్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్క భారతీయుడు ఒక సైంటిస్ట్ కావాలని డీఆర్‌డీఓ, ఇస్రో పనితనాన్ని వారికి వివరించి వారి ఆలోచనలను పెంచాలనే ఉద్దేశంతో ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ప్రస్తుత రక్షణ మంత్రిత్వ శాఖ సలాహాదారు అయిన డాక్టర్ సతీష్ రెడ్డి స్ఫూర్తితో తెలంగాణలో 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నియో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌లో డీఈవో అశోక్ కుమార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని పిల్లల యొక్క చైతన్యాన్ని, మీలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలని కోరారు. యువతి యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

కష్ట సుఖాల్లో తోడుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలి



అధ్యాపకులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని నవీన్ విద్యానికేతన్ హైస్కూల్‌లో 2000-2001లో పదవ తరగతి అభ్యసించిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరు వారి కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమంలో హాజరై ఆనాటి మధురస్మృతులను పంచుకున్నారు. అలాగే ఆ రోజుల్లో విద్యాబోధన చేసిన గురువులందరినీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆకుల నరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులందరు కష్ట సుఖాలలో కలిసి మెలిసి ఉంటూ ఒకరికొకరు సహకరించుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఆనాటి మధుర స్మృతులు పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆకుల నరేందర్ ఉపాధ్యాయ బృందం ఆకుల సురేందర్, సైకె కృష్ణదాస్ ,భోగ రుక్మాంగ, నాగుల రాజేందర్ గౌడ్, దేవ సహాయం, లింబాద్రి, రాధ, కరుణ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సన్మానించిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ ప్రాథమిక పాఠశాల 1983-84 బ్యాచ్కు చెందిన ఏడవ తరగతి పూర్వ విద్యార్థులు మామిడిపల్లిలో ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన చిన్నప్పటి మధురమైన జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి చేయూతనందించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఇటీవల పురపాలక సంఘం కౌన్సిలర్‌గా పదవి కాలం పూర్తి చేసుకున్న లిక్కి శంకర్‌ను మిత్రులు శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుభాష్ గౌడ్, రమణ, నాగరాజు, భూమేశ్వర్, మోహన్, రాజేందర్, శ్రీధర్ గౌడ్ ముత్తెన్న గంగారెడ్డి రాజేందర్ రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఆనందగిరి లక్ష్మి నృసింహా స్వామి బ్రహ్మోత్సవాలు



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ గ్రామంలోని మధ్వ రాయల పుణ్యక్షేత్రం అయిన శ్రీ ఆనందరిగి లక్ష్మి నృసింహ స్వామి క్షేత్రంపై ఆదివారం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు దండాల మోహన్ శర్మ ఆధ్వర్యంలో జరిగే బ్రహ్మోత్సవాలు మొదటి రోజు గ్రామాలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో స్వామివారి విగ్రహాలను ఉంచి ఊరేగింపుగా గ్రామం నుంచి గుట్టపైకి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు డిష్ బాలయ్య, సోషల్ మీడియా వారియర్ తెలంగాణ జాగృతి అధ్యక్షులు అజయ్, ఆలయ కమిటీ సభ్యులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో వాహనాల విస్తృత తనిఖీ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఆదివారం సాయంత్రం ఏసీపి ఆదేశానుసారం వాహనాల తనిఖీ నిర్వహించినట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. హెల్మెట్ లేకుండా ,సరైన ధ్రువపత్రాలు లేకుండా, త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వాహనదారులకు తగు జరిమానాలు విధించారు.

భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి

పట్టణ లైబ్రరీలో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్‌తో కలిసి ఆదివారం సందర్శించారు. లైబ్రరీలో నెలకొన్న సమస్యల గురించి పాఠకులను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్ట్యా చల్లని మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. లైబ్రరీలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారని, త్వరలోనే టాయిలెట్స్‌ను నిర్మిస్తామని తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని ఆయన పరిశీలించి త్వరగా భవనాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న భవనంపై నిర్లక్ష్యంగా సర్వీస్ లైన్ వైర్ ఉండడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులుతో మాట్లాడి సర్వీస్ లైన్ వైర్‌ను సరిచేయాలని సూచించారు. భవనం పూర్తికాగానే డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాఠకులతో ఈ విషయంపై చర్చించారు. లైబ్రరీ సేవలను పాఠకులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లైబ్రరీయన్ వరలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని సేవలు కొనసాగిస్తాం లయన్స్ ఇంటర్నేషనల్ పవర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



అవార్డు అందజేత

లయన్స్ ఇంటర్నేషనల్ పవర్ రీజియన్ 7 మీట్ కార్యక్రమాన్ని నగరంలోని అమృత గార్డెన్స్‌లో రీజియన్ చైర్మన్ లయన్ అనిల్ పాటిల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్ సహారా సేవలను గుర్తించి 12 ఎక్సెంట్ అవార్డులను క్లబ్ డిఎస్‌కి అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్యానర్ ప్రజెంటేషన్ ఫొటో ఎగ్జిబిషన్ బహుమతులను అందించారు. మల్టిపుల్ జిఎల్టిఏ లీడర్ ప్రకాష్, ఇంటర్నేషనల్ అంబాసిడర్ సూర్య రాజ్, పూర్వపు జిల్లా గవర్నర్లు తదితరులు పాల్గొన్నారు. అవార్డులు క్లబ్‌కి రావడంతో క్లబ్ జిల్లా కార్యదర్శి లయన్ ఉదయ సూర్య భగవాన్ సంతోషం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కూడా మరిన్ని సేవలు కొనసాగించి మరెన్నో పథకాలు సాధించే విధంగా ముందుకు సాగుతామన్నారు.

కాంగ్రెస్‌లో బీసీలకు పెద్దపీట

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ జాహుర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ జాహుర్ పేర్కొన్నారు. ఆదివారం అయన నవతెలంగాణతో మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కులగలన చేపట్టిందని, గత కొన్ని రోజుల క్రితం అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కులాల వారీగా లెక్క తేల్చేసి వివరించారని తెలిపారు. బీసీలకు రానున్న రోజుల్లో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ సీట్లు రిజర్వేషన్ పరంగా కేటాయించే విధంగా ప్రకటించి బిసిలకు ఇతర కులాలకు పెద్ద పిట వేస్తుందని అన్నారు. త్వరలో జరుగనున్న జడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి నాయకత్వంలో అందరం కలిసికట్టుగా పనిచేసి విజయ దుందుభి మోగించడం ఖాయమన్నారు. బీసీలకు పెద్దపీట వేయడానికి సహకరించిన సీఎం, ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే విజన్ కలిగిన నాయకులని వారి హయాంలో నిజామాబాద్ రూరల్ అభివృద్ధిలో ముందుంటుందని అశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే రూరల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నిధులను మంజూరు చేసినట్లు డాక్టర్ జాహుర్ పేర్కొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి జాతర



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ముల్లంగి, బొంకన్‌పల్లి గ్రామాల ఆధ్వర్యంలో వేణు గోపాల స్వామి జాతర ఆలయ కమిటీ సమక్షంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు నిర్వహించి స్వామి వారి ఊరేగింపు జరిపారు. అనంతరం యజ్ఞం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీరేందర్ రావు, వైస్ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గంలో త్రిపుర గవర్నర్ పర్యటన

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు నియోజకవర్గంలో త్రిపుర గవర్నర్ ఇంద్ర సేనారెడ్డి, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పర్యటించనున్నట్టు మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాక్లూర్ మండలంలోని గుత్ప శ్రీ అపురూప వెంకటేశ్వర స్వామి దేవాలయం, మండలంలోని అంకాపూర్ లాలన ఆశ్రమం, నవనాథ సిద్దేశ్వర ఆలయం సిద్దులగుట్ట దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం బిజెపి సీనియర్ నాయకులు భూపతి రెడ్డి, ఎమ్మెల్యే స్వగృహం అంకాపూర్‌కు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కమ్మర్ పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమ్మర్ పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఆకుల బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా జోగ గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా చిలివేరి పవన్ కుమార్, కోశాధికారిగా సురంగి చంద్రశేఖర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు బాలకృష్ణ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధికి, అసోసియేషన్ ఆధ్వర్యంలో యువతలోని క్రీడ నైపుణ్యాలు వెలికి తీసేందుకు అసోసియేషన్ సభ్యుల సహకారంతో తన వంతుగా కృషి చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను తోటి సభ్యులు అభినందించారు.

మాదిగలకు 11శాతం వాటా కేటాయించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓల్డ్ అంబేద్కర్ భవన్లో మాదిగ ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మాదిగ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సిల్మల సురేష్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను ప్రవేశపెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేపట్టిన మాదిగల ఆత్మగౌరవం మందకృష్ణ మాదిగకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న వర్గీకరణ అమలు జీవోలో మాదిగలకు 11శాతం వాటా కేటాయించాలని, మాదిగ ఉప కులాలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిజామాబాద్ జిల్లా మాదిగ ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగుల పక్షాన కోరారు. వర్గీకరణకు ఎంతో శ్రమించి పోరాడిన మందకృష్ణ మాదిగకి నిజామాబాద్ జిల్లా మాదిగ ఉద్యోగుల పక్షాన ఉద్యమ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగులు మిఠాయిలు పంచుకున్నారు. భవిష్యత్తులో మాదిగ ఉద్యోగులు మందకృష్ణ మాదిగ ఏ పోరాటం చేపట్టిన ఆయన వెనుకాలే వెన్నుముకగా ఉంటామని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్, మాదిగ ఉద్యోగుల నాయకులు తెడ్డు గంగారాం, మహేష్ కుమార్, సిహెచ్ గంగాధర్, ఎమ్మెస్ పి జిల్లా అధ్యక్షులు సరికెల పోశెట్టి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

రాములు రమేష్ , జిల్లా నాయకులు వినోద్ కుమార్ దుర్గయ్య, సాయిలు, రాములు, రాజనరేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా రంగాల్లో లయన్స్ క్లబ్ ముందుంది

- అంతర్జాతీయ లయన్స్ క్లబ్ డైరెక్టర్



మాట్లాడుతున్న అంతర్జాతీయ లయన్స్ క్లబ్ డైరెక్టర్

నవతెలంగాణ-బాల్కొండ

గ్రామీణ ప్రాంతాల్లో వివిధ సేవా రంగాల్లో లయన్స్ క్లబ్ ముందున్నాయని అంతర్జాతీయ లయన్స్ క్లబ్ డైరెక్టర్ సూర్యరావు అన్నారు. మండల పరిధిలోని కిసాన్ నగర్‌లో లయన్స్ క్లబ్ సొంత భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ సభ్యులు స్వచ్ఛందంగా ప్రజాసేవకు ముందుకు రావాలని కోరారు. గ్రామీణులు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగే సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ సభ్యులు జ్ఞాన సాగర్‌రెడ్డి, చాకులింగం, దినేష్ పటేల్, సుధీర్ బాబు, శ్రీనివాస్ గుప్తా, జీవన్, వంశి రెడ్డి, కొమ్ముల నరసయ్య అంజయ్య, కనకయ్య, ప్రసాద్, పోశెట్టి, భోజరాం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు గంగా జలాభిషేకం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గోదావరి నది నుంచి గంగాజలాలు తీసుకువచ్చారు. గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. గ్రామ అభివృద్ధి, సమృద్ధి కోసం ప్రతి సంవత్సరం లాగే ఈ అభిషేకాన్ని చేపడుతున్నట్టు వీడీసీ సభ్యులు తెలిపారు. కార్యక్రమం ద్వారా పంటలు విస్తారంగా పండాలని, గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.

యుజిసి నిబంధనలను అడ్డుకోవాలి

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొనగంటి నర్సయ్య

నవతెలంగాణ-భీంగల్ రూరల్



యుజిసి నిబంధనలను అడ్డుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొనగంటి నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయాలు ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లిపోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యావేత్తలపైన, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థుల పైన ఉందని పేర్కొన్నారు. కమిషన్ అయిన యూజీసీ సిఫార్సులు మాత్రమే చేయాలని, కానీ అందుకు భిన్నంగా అది శాసిస్తోందని తెలిపారు. వర్సిటీల ఉపకులపతులను యూజీసీ ఆయుధంగా వాడుకోవాలని చూస్తుందని, కేంద్రం గవర్నర్ల ద్వారా రాష్ట్ర యూనివర్సిటీల పాలన నియమాకాలను చేతుల్లోకి తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తి కి విరుద్ధమని పేర్కొన్నార. రాష్ట్రాల హక్కులను కాలరాసేలా ఉన్న ఈ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలిపారు. యుజిసి మార్గదర్శకాలు సరైన అభ్యర్థులు (నో సూటబుల్ క్యాండిడేట్ ఫౌండ్) అనే నిబంధనలను చేర్చడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్న రిజర్వేషన్ల ప్రకారం కాకుండా అభ్యర్థులు దొరకలేదని సాకుతో ఆ ఉద్యోగాలు ఇతర కేటగిరీలలో భర్తీ చేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గవర్నర్లు కేంద్ర రాజకీయాలకు అనుగుణంగా పనిచేస్తారని, అలాంటప్పుడు వీసీల నియమాకాన్ని వారికి ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు.

కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల, రాష్ట్రవర్సిటీల స్వయంప్రతిపత్తిని హరించే ప్రయత్నం చేస్తుందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన భావజాలాన్ని వేగంగా యువతలోకి తీసుకెళ్ళేందుకు వర్సిటీలను వాడుకుంటుందని తెలిపారు. ప్రపంచం మొత్తం కృత్రిమ మేథ గురించి మాట్లాడుతుంటే కేంద్ర ప్రభుత్వం కుంభమేళాలు, తొక్కిసలాటలు వంటి వాటి గురించి మాట్లాడుతుందని పేర్కొన్నారు. వీరికి విద్యార్థుల అవసరాలు, ప్రజల అవసరాలు పట్టవని, ప్రజలు బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. విద్యార్థులను, యువకులను గుళ్ళు, గోపురాల పేరట నయవంచన చేసి తప్పుదోవ పట్టించి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇలాంటి కుట్రలు ఇక ముందుకు సాగవని బిజెపి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఉత్తమ జోన్ చైర్మన్ అవార్డు అందుకున్న లయన్ విజయానంద్



అవార్డు అందుకుంటున్న లయన్ విజయానంద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగర శివారులోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్స్ ఎంపవర్ రీజియన్ 7 మీట్‌లో జరిగిన అవార్డ్స్ ఫంక్షన్‌లో లయన్ విజయానంద్‌కు ఉత్తమ లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ అవార్డు అందుకున్నారు. ఇట్టి అవార్డును ఎంపోవర్ రీజియన్ 7 చైర్మన్ లయన్ అనిల్ పటేల్, ప్రత్యేక అతిథి లయన్ ప్రకాష్ రావు అందచేశారు. ఇట్టి అవార్డు రావడానికి మంచి కార్యక్రమాలు చేసి తనకు సహకరించిన వారి జోన్‌లోని లయన్స్ క్లబ్ ఇందూర్, కామారెడ్డి, కామారెడ్డి వివేకానంద, సదాశివనగర్ అధ్యక్షులు, సభ్యులకు ధన్యవాదములు తెలియజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | ఫిబ్రవరి 10, 2025 | www.navatelangana.com

ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణానికి చెందిన ఈ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చార్టర్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో నందిపేట మండలం లోని అయిలా పూర్ గ్రామంలో ఆదివారం సమాజం చైతన్యంపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు చదువు నిమిత్తం అమెరికా ఇతరత్రా దేశాలకు వెళ్లే వారికి అక్కడ జరుగుతున్న ఇబ్బందుల గురించి వివరించారు. కార్యక్రమంలో అర్గుల్ సురేష్ , నందిపేట్ మండల్ పద్మశాలి సంఘాల ప్రధాన కార్యదర్శి భోగ రాము తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో వేములవాడ రాజరాజేశ్వర స్వామి కళ్యాణం

- పాల్గొన్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మస్కట్లో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో ఆదివారం పాల్గొన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీస్సులు తీసుకున్నారు. ఈ మహోత్సవంలో వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, ఎన్నారైలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సాటాపూర్‌లో పోచమ్మ తల్లి మహా యజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మతల్లి మహా యజ్ఞాన్ని నిర్వహించారు. పోచమ్మ తల్లి పున్ణ ప్రతిష్టాపన కోసం గ్రామస్తులు రెండు రోజులుగా వివిధ కార్యక్రమాలను చేపట్టారు. సోమవారం గ్రామస్తులందరూ తమ సరిహద్దు గ్రామం నుంచి ఊరేగింపుగా పోచమ్మతల్లి విగ్రహాలను తీసుకువెళ్లి పున: ప్రతిష్టాపన చేయనున్నట్లు గ్రామ కమిటీ అధ్యక్షులు కంఠం గంగారాం తెలిపారు. ఈ మహా యజ్ఞంలో సంతోష్ దంపతులు పాల్గొనగా.. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్, లచ్చేవార్ నితీన్, బాలకృష్ణ, గోపికృష్ణ, ప్రేమ్‌కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వర ఆలయంలో శివ మహా పడిపూజ

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని భోగేశ్వరాలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే శివ మహా పడిపూజ కార్యక్రమానికి మండల కేంద్రంలోని భక్తులతో పాటు జిల్లాలోని వివిధ గ్రామాల్లో శివమాల వేసుకున్న భక్తులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని శివసేవ సమితి గాంధారి తరపున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట వరకు గణపతి పూజ అమ్మవారి పూజ మహాదేవుని అభిషేకం తదితర కార్యక్రమాలతో ముగుస్తుందని శివసేవ సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో శివ సేవా సమితి సభ్యులు వెంకన్న, గురు శివ, కృష్ణగౌడ్, సంజు శివ, జాన్ శివ, రవి శివ, చంటి శివ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



జలాలకోసం వెళ్లిన గ్రామస్తులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు గంగా జలాభిషేకం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గోదావరి నది నుంచి గంగాజలాలు తీసుకువచ్చారు. గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. గ్రామ అభివృద్ధి, సమృద్ధి కోసం ప్రతి సంవత్సరం లాగే ఈ అభిషేకాన్ని చేపడుతున్నట్టు వీడీసీ సభ్యులు తెలిపారు. కార్యక్రమం ద్వారా పంటలు విస్తారంగా పండాలని, గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.

ఘనంగా గురుకుల వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఎంతో ఉత్సాహంగా విద్యార్థులు వేడుకల్లో డాన్సులతో హంగామా చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్‌కు మద్దతు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అశోక్ కుమార్‌కు తమ సంఘం మద్దతు ఉండనున్నట్లు గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నవీన్ రెడ్డి, శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్ కుమార్ ఒక ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. అశోక్ కుమార్ 36 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధత, నిజాయితీతో పని చేస్తున్నారని తెలిపారు. అటువంటి వ్యక్తి చట్టసభల్లో ఉండడం వల్ల సమస్యల పరిష్కారం కోసం దారి దొరుకుతుందని, గెజిటెడ్ లెక్చరర్స్ అందరు కూడా ప్రథమ ప్రాధాన్యత ఓటు ఆయనకే వేసి గెలిపించాలని కోరారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్

- ఫెడరేషన్ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి
- సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై పోరాడే సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టుల సమస్యలపై ఫెడరేషన్ ఆధ్వర్యంలో బలమైన పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ కృష్ణమాచారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మామిడి సోమయ్య మాట్లాడారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలు చేసేందుకు ఫెడరేషన్ నాయకత్వం సిద్ధం కావాలని సూచించారు. రాష్ట్రంలో, దేశంలో జర్నలిస్టుల పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని, హక్కులు హరింపబడుతున్నాయని, పాలకులు ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా దాటవేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు సార్లు అధికారంలో కొనసాగిన గత ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పూర్తిగా విస్మరించి తీరని అన్యాయం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వలేకపోయిందని, జీవో 239 సమీక్ష పేరుతో కమిటీ వేసి కాలయాపన చేస్తుందని విమర్శించారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, పెన్షన్ స్కీం, హెల్త్ కార్డులు, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీలు, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తదితర డిమాండ్ల సాధనకై ఫెడరేషన్ ఆధ్వర్యంలో బలమైన ఉద్యమాలు చేయాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు యూసుఫ్‌లు మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా అడ్‌హక్ కమిటీ కో-కన్వీనర్లు మోహన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రారంభించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు సోమయ్య

బాధిత కుటుంబాలకు పరామర్శ

- ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి మండలంలోని ఆయా గ్రామాలలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బాధిత కుటుంబాలను పరామర్శించి ఆదివారం ఆర్థికసాయాన్ని అందజేశారు. మండలంలోని శివనగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మహేష్ నానమ్మ మరణించిన విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాం రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మహేష్ కుటుంబాన్ని పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. మహేష్ నానమ్మ దుర్గవ్వ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండలంలోని భిక్కనూర్ గ్రామానికి చెందిన సాకలి ఏగొండ శనివారం ద్విచక్ర వాహనంతో చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందడంతో మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు. పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి వెంట బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మీబాలయ్య, గ్రామ ఉపాధ్యక్షులు సాయిలు, కిషన్, ప్రేమయ్య, దుర్గయ్య, కిష్టయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్, సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, సుఖేందర్‌రెడ్డి, మ్యదరి అమృత్ రావు, జైరాజ్, బాగయ్య, నారాయణ, మంగలి సత్యం, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవతెలంగాణ-రెంజల్

పిఆర్‌టియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కార్యాలయంలో మండలానికి చెందిన ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. మండలంలోని తాడ్‌బిలోలి పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేసిన రాజేందర్ సింగ్, బోర్గం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన నర్సింహారెడ్డిని వారు ఘనంగా సన్మానించారు. పిఆర్‌టియు సంఘంలో ఉన్నతమైన పదవులను చేపట్టి ఉపాధ్యాయులకు అనేక సమస్యలను పరిష్కరించి సేవలను అందించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు మండల అధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగంగౌడ్, కిషోర్ కుమార్, ఎడపల్లి పిఆర్టియు మండలాధ్యక్షులు సాయిరెడ్డి, గోవర్ధన్, రాష్ట్ర బాధ్యులు శ్రీరామ్‌నాయక్, మండల అసోసియేట్ అధ్యక్షులు తోహేర్, వివిధ మండలాల కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

శారీరక, మానసిక ధృఢత్వానికి క్రీడలు అవసరం

నవతెలంగాణ-కాసిపేట

శారీరక, మానసిక ధృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ముత్యంపల్లి క్రీడా మైదానంలో జరుగుతున్న కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ టోర్నీ ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్, బ్రేవ్ హార్ట్స్ సోల్జర్స్ జట్ల మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో బ్రేవ్ హార్ట్స్ సోల్జర్స్ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్సు రూ.50 వేలు, రన్నర్సు రూ.30 వేల నగదుతో పాటు ట్రోఫీలను బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల శారీరకంగా, ఆరోగ్యంగా, మానసిక ధృఢత్వానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాల్లో కూడా అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్ కుమార్, నిర్వాహకులు కమటం తిరుపతి, నామసామి రాజు, అప్పాల శేఖర్, వూటూరి సాయి కుమార్, ఇంగు నారాయణ, దాసరి శంకర్, నస్పూరి నర్సింగ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

1996-97 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోస్రా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నగరంలోని నిఖిల్‌సాయి హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆనాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండల విద్యాధికారి నాగయ్య మాట్లాడుతూ. 28 సంవత్సరాల తర్వాత అందరూ ఒక తాటిపైకి రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. తాము చదువు చెప్పిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదగడమే మాకు చాలా ఆనందంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి, గంగారెడ్డి, గణేష్, లక్ష్మణ్, మొగులయ్య, శంకర్ గౌడ్, వెంకటరెడ్డి, రవీందర్, స్వప్న, సుధాకర్ రెడ్డి, కవిత, సంగీత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర అకాడమీ చైర్మన్‌కు కొలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించారు. మండలంలోని కొలి ప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ తెలంగాణ ఆదివారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఇంటికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చింతలూరు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు

ఘనంగా ధ్వజారోహణం

- నేడు శ్రీసీతారామ చంద్రస్వామి వారి కల్యాణం
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రాక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లాలో ప్రసిద్ధి పొందిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకులు సుమిత్ శర్మ దేశ్పాండే ఆధ్వర్యంలో యాగ్నికుడు కందూరి భార్గవ చారి ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ట, భేరిపూజ, దేవత ఆహ్వానం నిర్వహించారు. సాయంత్రం నిత్యహోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మాజీ సర్పంచ్ గజవాడ గంగాదాస్, సుశీలబాయి దంపతుల కుమారులు గజవాడ జైపాల్, గజవాడ దేవేందర్, గజవాడ విజయానంద్, గడవాడ రాములు దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్, ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, డైరక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు గురడి నర్సారెడ్డి, పి.మహేందర్రెడ్డి, గడ్డం లక్ష్మణ్, దువ్వ నర్సింలు, వీడీసీ సభ్యులు బూస సుదర్శన్, లొక్కిడి యాదగిరి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా రామాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువుగా జరుగనుంది. ఈ కల్యాణ వేడుకలకు రాష్ట్ర దేవాదాయ శాఖ, అటవీ పరిరక్షణ శాఖ మంత్రి కొండా సురేఖ, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ శాంతయ్య గ్రామ పెద్దలు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయకమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రయోగ పరీక్ష కేంద్రాలు తనిఖీ




పరీక్షకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఇంటర్ విద్యాధికారి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో రెండవ స్పెల్ ప్రయోగ పరీక్షలు జరుగుతున్న పరీక్ష కేంద్రాలను ఆదివారం జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తనిఖీ చేశారు. ఆదివారం ప్రయోగ పరీక్షలు జరుగుతున్న నవిపేట మోడల్ జూనియర్ కళాశాల, నవోదయ జూనియర్ కళాశాల, మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెంజల్ మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలను ఇంటర్ విద్య అధికారి తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దిన్ అస్లామ్, కనకమహాలక్ష్మి, ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు జిల్లాలో మరో 15 కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో కెమెరాలు పనిచేస్తున్న విషయాన్ని స్వయంగా ఇంటర్ విద్య అధికారి పరిశీలించి సమీక్షించారు. ఇంటర్ విద్య అధికారి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి పరీక్షా కేంద్రంలో కెమెరాలకు జియో ట్యాగింగ్ పరిశీలించారు. కెమరాలు ఆగిపోకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ పని చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. బాగా చదివే విద్యార్థులకు అన్యాయం జరగవద్దనే ఉద్దేశంతో కెమెరాల ద్వారా హైదరాబాద్ నుండి కమిషనర్ పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ వితరణ



పరీక్షప్యాడ్లు, స్టేషనరీ అందజేసిన పట్వారి తులసి కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు పట్వారీ తులసి కుమార్ ఆదివారం పట్టణంలోని బధిర పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, స్టేషనరీ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా వితరణ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ సువర్ణ, ప్రిన్సిపాల్ మూర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

నవతెలంగాణ-దహేగాం

గెలుపోటములను సమానంగా తీసుకోవాలని బీజేపీ నాయకుడు పాల్వాయి సుధాకర్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని హత్తిని గ్రామంలో నిర్వహిస్తున్న పాల్వాయి పురుషోత్తమరావు స్మారక క్రికెట్, వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలీబాల్, క్రికెట్ క్రీడాకారులకు గ్రామానికి చెందిన యువజన నాయకుడు షేగం రాకేష్ సొంత ఖర్చులతో జెర్సీలను క్రీడాకారులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని, మండల స్థాయితో పాటు రాష్ట్రస్థాయిలో ఆడి సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, రాజాగౌడ్, శ్రీకాంత్, కేదారి పాల్గొన్నారు.